## కేజీబీవీని సందర్శించిన కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, మార్చి 28 : చెన్నూర్ కేజీబీవీని శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా.., లేదా.., అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏపీసీలో ఉన్న పెండింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో తాండూర్ విద్యాభారతి పాఠశాల పూర్వవిద్యార్థులు

తాండూర్, మార్చి 28 : మండల కేంద్రంలోని సురభి మినీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం తాండూర్ విద్యాభారతి పాఠశాల 2014-15 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపై చేరి యోగక్షేమాలు తెలుసుకొని, తమ ఆత్మీయతను పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు, తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ సురభి ఆగమరావు మాట్లాడుతూ పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.


## ఆర్ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 28 : ఆర్టీసీ డ్రైవర్ల నియామకాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆర్ఎం సోలేమాన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట పలువురు డ్రైవర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. డీఎం రాజ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ఇటీవల ఔట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్ల ఎంపిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని, అందుకుగాను సుమారు 250 మందికిపైగా ప్రైవేట్ డ్రైవర్లు దరఖాస్తులు చేసుకున్నారని, ఆర్ ఎం సోలేమాన్ అక్రమాలకు పాల్పడుతూ కొంత మందికి మాత్రమే సమాచారం అందించి ఈ నెల 26న నియామకాలు చేపట్టారన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మధుసూదన్, షాపిక్, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

# బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 28 : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, కుసం నీలాదేవి, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ బోగాడెతో కలిసి ఆర్వోఆర్, అట్రాసిటీ, భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలకు కల్పించే ప్రయోజనాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోలీసు శాఖ తరపున ఎస్సీ, ఎస్టీలు నమోదు చేసిన అట్రాసిటీ కేసుల వివరాలు, బాధితులకు జరిగిన న్యాయం, అందిన పరిహారం గురించి అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, పోడు భూముల పరిష్కారం, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అన్ని శాఖల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఉద్యోగోన్నతులు-రోస్టర్ విధానంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ చైర్మ న్, సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, జిల్లా అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యు లు కేశవరావు, గోపాల్, గణేశ్, అశోక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ టౌన్ : మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నస్పూర్, మార్చి 28 : మంచిర్యాల కలెక్టరేట్‌లో అధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ పరిధిలోని కేసులను క్రమబద్ధంగా పరిష్కరించాలని, మే 31లోగా మొత్తం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు తహసీల్దార్లు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు పాల్గొన్నారు.

### చైర్మన్‌ను కలిసిన జీఎం..

సీసీసీ నస్పూర్, మార్చి 28 : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సీసీసీలోని సింగరేణి అతిథి గృహంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటయ్యను శాలువాతో సత్కరించి, పూల మొక్క అందజేశారు. ఈ ప్రాంత సింగరేణి అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, శ్రీరాంపూర్ ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ఏజీఎం రాజేందర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఐఈడీ ఎస్ఈ, ఎస్సీ లైజన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తదితరులు ఉన్నారు.

# ముస్లింల శాంతియుత నిరసన

దండేపల్లి, మార్చి 28 : వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు దండేపల్లి మండలం తాళ్లపేటలో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు దావూద్‌ఖాన్, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, క్యాషియర్ రాజ్‌మహ్మద్ ఉన్నారు.

కాగజ్‌నగర్, మార్చి 28 : కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. జమాతే ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు బషీరుద్దీన్, మైనార్టీ నాయకుడు జాకీర్ షరీఫ్ మాట్లాడారు. ముస్లింలు అజారుద్దీన్ బాబా, సయ్యద్ సాదిక్ పాషా, దావూద్ అహ్మద్ సోఫి, వెల్దాత్ ఖాన్, అబ్బుషేర్, జాకీర్, హాజీ, ఏజాజ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, మార్చి 28 : సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని ఖదీం మసీదు ఎదుట ముస్లింలు నల్ల బ్యాడ్జీలు దరించి శాంతియుత నిరసన తెలిపారు. మౌలానా ఓసామా బిన్ అవద్, మాజీ ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, మస్జీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రఫీక్, ఉపాధ్యక్షుడు ఇఫ్ఫత్ హుస్సేన్, అబ్దుల్ కలాం, అబ్దుల్ కఫీం, కలీం, ఇలి యాజ్ అహ్మద్, ఖాజా నజీముద్దీన్, రజీ అహ్మద్, కుర్షీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 28 : మంచిర్యాల పట్టణంలోని ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి, నమాజ్ చేవారు. మోమిన్‌పురలో ముఫ్తీ మసూద్, మహ్మద్ తాజుద్దీన్, నయీం, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి, మార్చి 28 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి రెండో జోన్‌లో గల మదీన మసీదులో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జమాతే ఇస్లాం హింద్ గోదావరిఖని ఉపాధ్యక్షుడు, ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్ సాబ్, మదీనా మసీదు కమిటీ సభ్యులు ఎండీ షరీఫ్, ఎండీ యాకూబ్, ఎండీ బషీర్, ఇమామ్ పాల్గొన్నారు.


దండేపల్లి : నినాదాలు చేస్తున్న ముస్లింలు


మంచిర్యాల (ఏసీసీ) : మంచిర్యాలలోని మసీదు వద్ద..


కాగజ్‌నగర్ : అంబేద్కర్ చౌరస్తాలో నిరసన..

## కార్మికుల సంతకాల సేకరణ

జైపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని 1ఏ గనిపై అధికారుల వైఖరికి నిరసనగా హెచ్ఎంఎస్ నాయకులు శుక్రవారం సంతకాల సేకరణ నిర్వహించారు. అధికారుల సంఘం హెచ్‌హెంఎస్‌పై చేసిన ఆరోపణలను కార్మికులు ఖండించారు. సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ.. గనిలో ప్రమాదాలు జరిగినప్పుడు సక్రమంగా రిపోర్టులు రాయకుండా బాధిత కార్మికులను సొంత ఖర్చులతో ప్రైవేటు దవాఖానకు వెళ్లాలని అధికారులే ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆరోపించారు. నిరాకరించిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సంఘం నాయకులు అనిల్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు కంబాల నర్సయ్య, మీస కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఎదుట ఆందోళన


పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

కాగజ్‌నగర్, మార్చి 28 : విద్యార్థులపై ఆగడాలను నిరసిస్తూ శుక్రవారం కాగజ్‌నగర్ మండలం చారిగాం రోడ్డులో గల సెయింట్ క్లారెటి విద్యాలయం ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను ఆరుబయట నిలబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ విద్యార్థులను కలిసేందుకు కూడా ప్రిన్సిపాల్ జోసెఫ్ నిరాకరిస్తున్నారన్నారు. ఎప్పుడూ దురుసుగా మాట్లాడుతుంటారని పేర్కొన్నారు. ఫీజుల పేరిట ఇబ్బందులకు గురిచేయకుండా ఉన్నాతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ విషయమై సెయింట్ క్లారెటి విద్యాలయం ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

## నీల్గాయిని వేటాడి చంపినందుకు..

### ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మరొకరిని అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ అధికారులు


పట్టుబడ్డ వేటగాళ్లతో అటవీ అధికారులు

బెజ్జూర్, మార్చి 28 : నీలుగాయి వేటాడి చంపిన ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు, మరో ఐదుగురిని పోలీసులు గుర్తించారు. ఈ ఘటన పెంచికల్‌పేట రేంజ్‌లో జరిగింది. కొండపల్లి గ్రామానికి చెందిన చాపిలే వెంకటేశ్, ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, మన్నెంపల్లి శ్రీహరి, ఆత్రం భీమయ్య, ఎల్లూర్‌కు చెందిన దుర్గం రవీందర్ (మేరగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు) గురువారం మధ్యాహ్నం నీలుగాయిని వేటాడి చంపి కూర వండుకొని తిన్నారు. ఇందులో కొందరు (అరుగులు) మిగిలిన మాంసాన్ని ఆరబెట్టుకోగా, స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారమందించారు. ఈ మేరకు శుక్రవారం తెల్లవారు జామున దాడులు నిర్వహించి రవీందర్, వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతుండగతా, మిగతా వారు తప్పించుకున్నట్లు ఎఫ్ఆర్వో అనిల్ తెలిపారు. కేసు విచారణ జరుగుతున్నదని అన్నారు. ఎఫ్ఎస్‌వో శంకర్, ఎఫ్‌బీవోలు సంఘదీప్, సతీశ్, లచ్చన్న, మనోహర్, యానిమల్ ట్రాకర్ సిబ్బంది ఉన్నారు.

## శేష జీవితం ఆనందంగా గడపాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్‌లో విధులు నిర్వహించి విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏవో శ్రీనివాస్, ఆర్ఐ దామోదర్, సూపరింటెండెంట్‌లు మనోజ్‌కుమార్, సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీరాంపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ జాతీయ రహదారిలోని జీఎం ఆఫీస్ సమీప రింగ్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిలో సపోర్టుమన్ కార్మికులు చీకటి జనార్దన్, కంచర్లగట్టు రాజు విధులు ముగించుకొని, బైకుపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి వద్ద ఓమినీ వ్యాన్ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడగా, వారిని రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి ఉప్పాల సంపత్, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పరామర్శించారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వైద్యులతో మాట్లాడారు. కరీంనగర్‌లోని కార్పొరేట్ దవాఖానకు తరలించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జన్నారం, మార్చి 28 : దండేపల్లి మండలం బుట్టాపూర్ వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో కారం శ్రీనివాస్ తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వాటిని రేంజ్‌కు తరలించి, కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

## గుడుంబా కేసులో ఒకరి బైండోవర్

మందమర్రి రూరల్, మార్చి 28 : దొరలబంగ్లా ఏరియాలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న మానుపాటి సంపత్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ ఏఎస్ఐ మజీద్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేయగా, 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించినా, గుడుంబా తయారుచేసినా క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

## జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

కోటపల్లి, మార్చి 28 : కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని నవదుర్గా జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంబంధిత సిబ్బంది అక్కడికి చేరుకొని, మంటలను అదుపులోకి తెచ్చారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

## నార్కోటిక్ జాగిలాలతో తనిఖీ

కోటపల్లి, మార్చి 28 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో గురువారం రాత్రి నార్కోటిక్ జాగిలాలతో తనఖీలు నిర్వహించారు. కోటపల్లి మండలంలోని రాపనపల్లి గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నేరాల నియంత్రణ కోసం, అక్రమ రవాణా నివారణ కోసం నార్కోటిక్ ఎనాలిసిస్ డాగ్, డ్రోన్ కెమెరాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## బార్‌లో గొడవ.. ఇద్దరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చన్నంబట్టి ఏరియా వంద ఫీట్ల రోడ్డు వద్ద గల రాక్ అండ్ రోల్ బార్ అండ్ రెస్టారెంట్‌లో గురువారం జరిగిన గొడవ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తే ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం తాళ్లపల్లికి చెందిన దెబ్బటి శ్రీనివాస్ తన స్నేహితులు మల్లేశ్, అశోక్ రాక్ అండ్ రోల్ బార్‌లో టేబుల్‌పై మద్యం తాగుతున్నారు. అదే గ్రామానికి చెందిన బాడిసె రమేశ్ వారి వద్దకు వచ్చి మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో అతడిని నిలబెట్టి మాట్లాడుతావా అంటూ శ్రీనివాస్‌ను నస్పూర్‌కు చెందిన ఐతె మహేశ్ చెంపపై కొట్టాడు. అనంతరం శ్రీనివాస్ బిల్లు కట్టేసి బయటకు వెళ్లి, తన తమ్ముడు దెబ్బటి శ్రీకాంత్‌కు ఫోన్ చేసి బార్ వద్దకు పిలిపించుకొని విషయం చెప్పాడు. బార్‌లోకి వెళ్లి మహేశ్‌ను అడుగగా, బీరు సీసాలతో తలపై కొట్టాడు. అడ్డుకోబోయిన శ్రీనివాస్‌నూ కొట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని మహేశ్, ప్రశాంత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## సింగరేణి ఐరన్ పట్టివేత

శ్రీరాంపూర్, మార్చి 28 : సింగరేణికి సంబంధించి దొంగిలించబడిన ఇనుప సామానును శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా అరుణక్కనగర్‌లోని స్క్రాప్ దుకాణంలో ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి 2 క్వింటాళ్ల సామగ్రి స్వాధీనం చేసుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE

★Vehicle for Auction: On where conditions Maruthi ALTO K10-VXI (O) Veh No: TS03ES6987, Contact: INDUSIND Bank Ltd. MNCL. Cell: 87901 48866.
NTK-335539

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## సజావుగా పదో తరగతి పరీక్షలు

నస్పూర్, మార్చి 28 : జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. ఐదోరోజు శుక్రవారం భౌతిక రసాయన శాస్త్రం పరీక్ష నిర్వహించారు. 49 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 9,175 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. గతంలో ఫెయిలైన 118 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణ రెడ్డి రెండు కేంద్రాలు, డీఈవో యాదయ్య మూడు.., అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ ఒకటి, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 13 పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

## రంజాన్ తోఫా అందజేత

మందమర్రి, మార్చి 28 : రంజాన్ వేడుకలను పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని పలు ముస్లిం కుటుంబాలకు ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన బిర్లా టీఎస్ఎం దాడి రాజుకు సొసైటీ అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పట్టణాధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, మండలాధ్యక్షుడు సకినాల శంకర్, జావీద్ పాషా, ఎండీ ఇసాక్, వెంకటేశ్ ఉన్నారు.

## రెబ్బెన ఎస్ఐకి ప్రశంసా పత్రం

రెబ్బెన, మార్చి 28 : లోక్ అదాలత్ కేసులు పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్‌కు శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ప్రశంసా పత్రం అందించారు. ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి అభినందనలు తెలిపారు.

## టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌ను శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఘనంగా సన్మానించారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన పెట్టం లక్ష్మణ్ రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ తొంగల రమేశ్, మారం శ్రీనివాస్, గొర్ల సంతోష్, ఉత్తేజ్ రెడ్డి, దుర్గం రవికుమార్ పాల్గొన్నారు.

## ఫలితాలు వెల్లడించాలి

శ్రీరాంపూర్, మార్చి 28 : సింగరేణి యాజమాన్యం వెల్డర్ పరీక్షా ఫలితాలు వెల్లడించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వెంటనే మెకానికల్ చార్జ్‌హ్యాండ్ పరీక్షా ఫలితాలు వెల్లడించి, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు నిర్వహించి, ఆరు రోజులు గడుస్తున్నా ఫలితాలు ప్రకటించపోవడంతో కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

## పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. షబ్-ఎ-ఖద్ర్-జాగ్ నే కి రాత్ సందర్భంగా గురువారం అర్ధరాత్రి పట్టణంలోని పురవీధుల్లో ఆకస్మికంగా సందర్శించి, ముస్లింలతో మాట్లాడారు. అనంతరం మంచిర్యాల రైల్వే స్టేషన్, పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి, విధి నిర్వాహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కౌటాల, మార్చి 28 : కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం మండలంలోని 144 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పుష్పలత శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 10గంటలకు రావాలని సూచించారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

హాజీపూర్, మార్చి 28 : నకిలీ పత్తి విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన అన్నారు. మండలంలోని గుడిపేటలో గల రైతు వేదికలో శుక్రవారం రైతులు, ఫెర్టిలైజర్ డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని, అందుకు సంబంధించిన రసీదును పంట కాలం పూర్తి అయ్యేవరకు దాచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అనిత, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే, ఎస్ఐ గోపతి సురేశ్, మండల వ్యవసాయ అధికారి కృష్ణ, ఏఈవోలు, రైతులు, విత్తన డీలర్లు, విత్తన కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్, మార్చి 28 : నకిలీ పత్తి విత్తనాలు విక్రయించిన, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని తాండూర్ ఎస్ఐ డీ కిరణ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో పోలీసు, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులకు నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సుష్మ, మాదారం, భీమిని ఎస్ఐలు సౌజన్య, విజయ్‌కుమార్, ఏఈవో శంకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, మార్చి 28 : మండలంలోని ఆకెనపల్లిలో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖలు సంయుక్తంగా రైతులకు ఏడీఏ రాజా నరేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీశారు. వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్, తాళ్ల గురిజాల ఎస్ఐ చుంచు రమేశ్, ఎంపీవో శ్రీనివాస్, ఏఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట, మార్చి 28 : మండలంలోని కోమటిచేను, దేవాపూర్ గ్రామాల్లో రైతులకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, ఏఎస్ఐ బూర రవీందర్, ఏఈవోలు రమ్య, సంధ్యా రాణి పాల్గొన్నారు.

## గూడెం పాఠశాలలో ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్

దండేపల్లి, మార్చి 28 : దేశంలోని వివిధ రాష్ట్రాల విభిన్న సంస్కృతుల ప్రజల మధ్య పరస్పర అవగాహనను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రారంభించిన ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని మండలంలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. తెలంగాణతో జతపరిచిన హర్యాణా వేషాధారణలు, పండుగలు, వంటలు, ఆహారపుటలవాట్లు, సంస్కృతీసంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్ఎం కమలాకర్, సీఆర్పీ రమేశ్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

## కులగణన కోసం పాదయాత్ర

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 28 : కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం నుంచి హాజీపూర్ వరకు ఏప్రిల్ 16 నుంచి పాదయాత్ర చేయనున్నట్లు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బ్రిటిష్ హయాంలో కులగణన చేశారని, ఆ తర్వాత 78 ఏళ్లు గడిచినా, చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్, అక్కల రమేశ్, కర్రె లచ్చన్న, అంకం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా పోటీల రెఫరీ పరీక్షల్లో ప్రతిభ

జన్నారం, మార్చి 28 : జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లొమా ఆన్‌లైన్ పరీక్షల్లో మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్ ప్రతిభ చూపినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి సిద్ధారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి రెఫరీ పరీక్షల్లో అన్ని రాష్ట్రాల నుంచి 130 మంది పరీక్ష రాశారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ చేతుల మీదుగా ఆన్‌లైన్‌లో ప్రశంసాపత్రాన్ని అందించారు.

## కుక్కల బెడద నుంచి కాపాడండి

బెల్లంపల్లి, మార్చి 28 : పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. పలు వార్డుల్లో గుంపులు, గుంపులుగా వీధి కుక్కలు తిరుగుతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి, సమస్య త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## అట్టహాసంగా ఎడ్లబండ్ల పోటీలు

కాసిపేట, మార్చి 28 : కాసిపేట మండలం ముత్యంపల్లి శివారులో అట్టహాసంగా ఎడ్లబండ్ల పోటీలు ఘనంగా నిర్వహించారు. ముత్యంపల్లి శివారు పెద్ద ధర్మారం నుంచి గురువాపూర్ గ్రామాల మధ్య పుట్ట శేఖర్ ఆధ్వర్యంలో పోటీలు చేపట్టారు. కాసిపేట మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ ప్రారంభించారు. చిన్న వెంకటాపూర్‌కు చెందిన గెల్ల గణపతి(ప్రథమ), ఊరు మందమర్రికి చెందిన రెడ్డి అభయ దేవా(ద్వితీయ), ముత్యంపల్లికి చెందిన పుట్ట శేఖర్(తృతీయ) గెలుపొందారు. మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

## యాదవుల అస్థిత్వాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు

శ్రీరాంపూర్, మార్చి 28 : యాదవుల అస్తిత్వాన్ని దెబ్బతీసేలా శాసన మండలిలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, యాదవుల హక్కులు కాలరాయాలని చేస్తే సహించేది లేదని యాదవ ఒగ్గు పూజారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజనమేన శ్యామ్‌కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు చిట్టవేణ వెంకటేశ్ స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుల వృత్తిని దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి తన మాటలు వెనక్కు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రచార కార్యదర్శి అల్లంల వెంకటేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంగ మల్లయ్య, మల్లేశ్, రాయమల్లు, మొండన్న, నగేశ్, తిరుపతి, లింగన్న, నాగరాజు, రఘు, హరీశ్, బానేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన

కాసిపేట, మార్చి 28 : వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా 'అమ్మా నాన్నకు చదువు' అనే అంశంపై కాసిపేట జడ్పీ, లంబాడీతండా(ఎస్), తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు చదువు నేర్పించే విధానంపై వయోజన విద్యాశాఖ డీఆర్పీలు బండ శాంకరి, సుమన్, కే అశోక్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7, న్యూటెక్ గనుల్లో విధులు నిర్వహిస్తున్న గైర్హాజరు కార్మికులు, వారి కుటుంబాలకు శుక్రవారం జీఎం ఆఫీస్‌లో జీఎం ఎం శ్రీనివాస్, డీవైజీఎం అరవిందరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడాదికి కనీసంగా 100 మస్టర్లు నింపకపోవడం వల్ల సంస్థకు ఉత్పత్తి నష్టం, కుటుంబాలకు ఆర్థికంగా నష్టం కలిగి ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఎస్‌వోటూజీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డాక్టర్ రమేశ్‌బాబు, పీఎం రాజేశ్వర్‌రావు, డీవైపీఎం రాజేశ్, సంతన్, పాల్ సృజన్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల పాల్గొన్నారు.